సాయం అందేనా..!

- వరదల్లో పంటలు కోల్పోయిన రైతులు
- ఎనిమిది మండలాల్లో 1404 హెక్టార్లలో నష్టం
- పరిహారం కోసం ఎదురుచూపు

మామిడికుదురు: గోదావరి వరద కూరగాయల రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. ఎంతో కష్టపడి పండించిన కూరగాయల పంటలు తనలో కలిపేసుకుంది. పెట్టుబడి, శ్రమ అంతా నీటిలో తుడిసి పెట్టుకుపోయింది. వరద నీటిలో మునిగి పుబారిన పడిన పంటలు ఎండిపోయి, కుళ్లిపోయాయి. అరటి, బీర, బెండ, దొండ, వంగ, మునగ, బొప్పాయి, తమలపాకు తదితర రైతులకు తీరని నష్టం కలిగింది. నష్టపోయిన రైతులు మళ్లీ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్యూమరేషన్ పూర్తయింది. త్వరలోనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. జాప్యం లేకుండా వెంటనే పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

1404 హెక్టార్లలో పంట నష్టం

పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో కూరగాయల తోటలు గత నెలలో వచ్చిన వరదకు దెబ్బతిన్నాయి. రెండు నియోజకవర్గాల్లోను 144.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నిర్ధారించారు. 4584 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 3,369 మంది రైతులకు చెందిన 925 హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతింది. కొత్తపేట నియోజకవర్గంలో 1215 మంది రైతులు పండించిన 479.94 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు పాడైపోయినట్లు ఉద్యాన శాఖాధికారులు నివేదిక రూపొందించారు. తుది నివేదికను సిద్ధం చేసి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు.



గోదావరి వరదకు నాశనమైన వంగతోట

రూ.80 వేలు పెట్టుబడి పెట్టా



ఎంతో కష్టపడి రెండెకరాల్లో మునగ పంట పండించా. రూ.80 వేలు వరకు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి వచ్చే సమయంలో గోదావరి వరద మొత్తం పంటను ముంచెత్తింది. మునగ తోట చనిపోయింది. దానిలోనే కూరగాయలు కూడా సాగు చేశా. అవి కూడా కుళ్లిపోయాయి. మంచి దిగుబడి వస్తుందని, ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తే అంతా ఆడియాసలుగా మారాయి. నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొమ్ముల వెంకటేశ్వరరావు, రైతు, పెదపట్నంలంక

పంట చేతికందే సమయంలో..



60 ఎకరాల్లో బొంత, కర్పూర అరటి పంట సాగు చేశా. పంట సాగుకు రూ.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టా. పంట ఎంతో చక్కగా ఎదిగింది. అరటి తోటలు గెలలు వేశాయి. పంట చేతి కందే సమయంలో గోదావరి వరద తోటలను ముంచేసింది. పది రోజుల పాటు వరద నీటిలో తోటలు మునిగి ఉండడంతో అంతా కుళ్లిపోయింది. నాతో పాటు చాలా మంది రైతులకు భారీగా నష్టం వచ్చింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రైతు, కె.ఏనుగుపల్లి

రూ.1.50 లక్షల నష్టం



పి.గన్నవరం మండలం తాటికాయలవారిపాలెంలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నాను. అర ఎకరంలో పచ్చిమిర్చి, అర ఎకరంలో మునగ పంట సాగు చేశాను. గోదావరి వరదకు రెండు పంటలు పాడైపోయాయి. ఈ పంటల సాగుకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పంట కోతకు వచ్చే దశలో గోదావరి వరద నన్ను నిలువునా ముంచింది. మంచి ఆదాయం వస్తుందనుకున్న సమయంలో గోదావరి వరద కనీసం పెట్టుబడి కూడా దక్కకుండా చేసింది. సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– వేమన పెద్దిరాజు, కౌలు రైతు, లంకలగన్నవరం

క్లుప్తంగా

నరసన్నను దర్శించుకున్న ఎస్సై



అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఉన్న ఎస్సై కుడుపూడి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం సఖినేటిపల్లి పోలీసుస్టేషన్ నూతన ఎస్సై కుడిపూడి దుర్గా శ్రీనివాసరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎస్సైకు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి తీర్థ, ప్రసాదాన్ని అందజేశారు.

బాధితులకు సాయం



లూటుకుర్రులో బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ తాతకాపు

మామిడికుదురు: లూటుకుర్రులో గత నెలలో కురిసిన వర్షాలకు ముంపు బారినపడిన బాధితులు 80 కుటుంబాలకు బుధవారం ప్రభుత్వ సహాయాన్ని సర్పంచు అడబాల తాతకాపు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 25 కిలోలు బియ్యం, పప్పు, ఆయిల్, ఉల్లిపాయలు, బంగాళా దుంపలను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బోణం బాబు, విళ్ల సుబ్బారావు, మద్దాల నాగబాబు, వీఆర్వో శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

స్నేహితుని పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే



స్నేహితుడు సూరిబాబు పాడెమోస్తున్న మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: తన స్నేహితుడు అయిన వైఎస్సార్ సీపీ నాయకుడు రుద్రరాజు సూరిబాబురాజు మృతి చెందడంతో బుధవారం ఆయన అంతక్రియలలో రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పాల్గొన్నారు. సూరిబాబు పాడె మోసిన రాపాక తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. చిన్న తనం నుంచీ తనకు రాజకీయపరంగా అన్ని విధాలుగా సూరిబాబు ఆసరగా ఉన్నారని రాపాక పేర్కొన్నారు.

మోటార్ల దొంగల అరెస్టు



మోటార్ల దొంగలను అరెస్టు చేసిన ఎస్సై సురేష్

మలికిపురం: మండలంలో విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై పి.సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గుడపల్లి పల్లిపాలెం సెంటర్‌లో గూడపల్లి పల్లిపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి పవన్ కల్యాణ్, కొప్పడి నరసింహస్వామి, కొప్పాడి రాఘవ, కొల్లు రాజేష్, తిరుమని జాన్‌రత్నం మోటార్లను విక్రయించేందుకు రాగా వారిని అరెస్టు చేశామన్నారు. ఈ ఐదుగురు చెడు వ్యసనాలకు బానిసై గూడపల్లి పల్లిపాలెం, శంకర గుప్తం గ్రామంలోనూ పొలాలు, చెరువుల వద్ద ఉన్న ఎలక్ట్రికల్ మోటార్లను దొంగిలించి వాటిని అమ్ముకుని ఆ డబ్బులతో జల్సా చేస్తున్నారు. అ విధంగా బుధవారం వచ్చిన వారిని అరెస్టు చేసినట్లు మలికిపురం ఎస్సై తెలిపారు.

మాజీ ఎంపీటీసీ మృతి



పెన్మెత్స నాగరాజు (ఫైల్)

ఆత్రేయపురం: స్థానిక ఒకటో వార్డు, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స నాగరాజు(44) బుధవారం తెల్లవారు జామున హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత రెండేళ్ల క్రితం తన కుమారుడు చదువు నిమిత్తం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మృతదేహాన్ని ఆత్రేయపురం తీసుకువస్తున్నారు. అంత్యక్రియలు ఇక్కడే జరగనున్నాయి. నాగరాజు కరోనా సమయంలో స్థానికంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ఎంతో మందికి సాయం అందించారు. గ్రామంలో ఆయన అంటే ప్రతి ఒక్కరూ అభిమానం చూపుతారు. ఆయన మృతికి స్థానికులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

రేపు శ్రీనూకాంబిక అమ్మవారికి కుంకుమ పూజలు

ఆలమూరు: చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో మూడో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గణపతి పూజలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. ఈ పూజాది కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనవచ్చనన్నారు.

కిల్కారి సేవలపై అవగాహన పెంచాలి

ఆలమూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య రక్షణకు తోడ్పాటును అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలని పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో కిల్కారి సేవల ఆవశ్యకతను వివరించారు. కిల్కారి మొబైల్ అకాడమీ (కెఎంఏ) ప్రసంగాన్ని గర్భిణులకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బందికి వివరించారు.

హైస్కూల్‌కు రూ.లక్ష డిపాజిట్



హెచ్‌ఎంకు రూ.లక్ష డిపాజిట్ నమూనా చెక్కును అందజేస్తున్న దాతలు

రావులపాలెం: ఈతకోట హై స్కూల్‌కు దాతలు జనిపిరెడ్డి గంగారావు, రమణి దంపతులు రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్టు హెచ్‌ఎం కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం ఆగస్టు 15 రోజున పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.

ఆలోచింపజేస్తున్న చిత్రాలు



ఈదరాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు వేసిన చిత్రాలు

మామిడికుదురు: ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 10వ తరగతుల విద్యార్థులు వేసిన చిత్రాలు చూపరులను ఆలోచింపజేస్తున్నాయి. కోల్‌కతా సంఘటన నేపథ్యంలో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కన్నీటి గాథలను కళ్లకు కట్టినట్టు వివరిస్తూ విద్యార్థులు అద్భుతమైన పెయింటింగ్స్ వేశారు. డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీను ఆధ్వర్యంలో వేసిన పెయింటింగ్స్ గుండెల్ని పిండేస్తున్నాయి. ఆడపిల్ల అని నిర్ధారణ అయిన మరు క్షణం తల్లి గర్భంలోనే వారిని చిదిమేస్తున్న చిత్రాలు, అత్యాచార దాడులు, వేధింపులు తదితర అంశాలను సూచిస్తూ గీచిన పెయింటింగ్స్‌ను విద్యార్థులు పాఠశాలలో ప్రదర్శించారు. వీటిని రూపొందించిన విద్యార్థులను హెచ్‌ఎం జి.సాయిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి పనులు గుర్తింపునకు గ్రామసభలు

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో 2024–25 సంవత్సరానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గుర్తింపు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఉపాధి హామీ ఏపీఓ కవిత బుధవారం తెలిపారు. గ్రామసభల నిర్వహణ కోసం మండల స్థాయి, నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఈతకోట, గోపాలపురం, కేతరాజుపల్లి, లక్ష్మీ పోలవరం, ముమ్మిడివరప్పాడు, రావులపాడు, రావులపాలెం, ఊబలంక, వెదిరేశ్వరం గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు దేవరపల్లి, పొడగట్లపల్లి, కొమరాజులంక గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభలకు గ్రామస్తులు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు సమాచారం ఇవ్వాలన్నారు.

చేనేత వస్త్రాల ఉత్పత్తిలో మార్పులపై అవగాహన



కె.జగన్నాథపురంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న టాటా తనైరా ప్రతినిధులు, చేనేత, జౌళిశాఖ అధికారులు

అయినవిల్లి: మారుతున్న వస్త్రాధారణకు అనుగుణంగా చేనేత వస్త్రాల ఉత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా చేనేత, జౌళి అధికారి ఎం.రాజు, కె.జగన్నాథపురం చేనేత సహకార సంఘం భవనంలో బుధవారం అవగాహన కల్పించారు. జిల్లా చేనేత, జౌళి అధికారి ఎం.రాజు ఆధ్వర్యంలో టాటా తనైరాతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని చేనేత సహకార సంఘాలతో చేనేత వస్త్రాల కొనుగోలు, ఉత్పత్తిలో తీసుకోవాల్సిన మార్పులపై చర్చించారు. జిల్లాలో చేనేత సహకార సంఘాలతో టాటా తనైరాతో ఒప్పందం చేసుకుంటే జిల్లాలో ఉన్న చేనేత కార్మికుల ఉపాధి, చేనేత పరిశ్రమకు అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఈ సమావేశంలో టాటా తనైరా ప్రతినిధులు, జిల్లా సహకార సంఘాల సెక్రటరీ లు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రావులపాలెంలో జాబ్‌మేళా



రావులపాలెంలో జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం: గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు జాబ్ మేళాలు వరం లాంటివని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం రావులపాలెం శ్రీ సత్య సాయి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో యువ నాయకుడు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో వికాస సారథ్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రభుత్వ ప్రైవేటు సెక్టార్లతో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ మేళాకు 1813 మంది హాజరు కాగా 711 మందికి వివిధ కంపెనీల్లో నియామక పత్రాలు ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వెంకటాచార్య బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ వెంకటాచార్యను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

అయినవిల్లి: అయినవిల్లి ఎంపీడీఓగా తాడి వెంకటాచార్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన సూర్యనారాయణ మూర్తి ఎంపీడీఓగా పనిచేశారు. సూర్యనారాయణ మూర్తి బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా ఏలేరుపాడు వెళ్లారు. వెంకటాచార్యను కార్యాలయ సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

యోగా విద్యార్థుల రక్తదానం



కాకినాడలో రక్తదానం చేస్తున్న యోగా విద్యార్థులు

కొత్తపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి కొత్తపేట స్వామి వివేకానంద యోగా శిక్షణ కేంద్రం స్టూడెంట్స్ రక్తదానం చేశారు. యానంకు చెందిన నడిపల్లి వెంకట్ అనే వ్యక్తి మంగళవారం సామర్లకోటలో బంధువుల ఇంటికి వెళుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసరంగా రక్తం అవసరమైంది. దాంతో బాధితుని బంధువులు యోగా శిక్షణా కేంద్రం మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. శ్రీనివాస్ శిక్షణ కేంద్రం స్టూడెంట్స్ పి.ప్రవీణ్, ఎస్.మధు, ఎల్.దుర్గేష్, ఎ.సాత్విక్‌లు రక్తదానం చేశారు.

పుదుచ్చేరికి ఈవీఎంల తరలింపు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నిక నేపథ్యంలో తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను తిరిగి బుధవారం యానాం నుంచి పుదుచ్చేరికి తరలించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలను ప్రత్యేక వాహనంలో పోలీసు భద్రత మధ్య తరలించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎన్నికల శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

విచారణ జరుగుతుండగా ఎన్నికలేంటి?

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో జరిగిన అవినీతిపై విచారణ కొనసాగుతుండగా ప్రస్తుతం కోపరేటివ్ స్టోర్స్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించడంపై ఎల్జీ కె.కై లాష్‌నాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు సోషల్ యాక్టివిస్ట్ మండపాక సత్తిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యానాం కోపరేటివ్ స్టోర్స్‌కు సంబంధించి మద్యం షాపుల నిర్వహణలో రూ.71,29,569 సొమ్ము పక్కదోవ పట్టిందన్నారు. సొసైటీకి సంబంధం లేని వ్యక్తి దానికి బాధ్యుడని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అనంతరం కోపరేటివ్ రీజినల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల బృందం తనిఖీ చేసి అవినీతి వాస్తవమేనని పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్‌కు నివేదికను సైతం పంపారన్నారు. 2018–21 మధ్య కాలంలో జరిగిన ఐఎమ్‌ఎఫ్‌ఎల్ విక్రయాల్లో జరిగిన అవినీతిపై 44 పేజీల విచారణ నివేదికను సైతం పంపారన్నారు. ఇందులో ఐఎమ్‌ఎఫ్‌ఎల్ సెక్షన్ ఇన్‌చార్జి, ఏడుగురు సేల్స్‌మెన్‌లు సొమ్ములు దుర్వినియోగం చేశారని తేలిందన్నారు. వీరి నుంచి సొమ్ము రికవరీ చేయడానికి సంబంధించి ఇంకా విచారణ జరుగుతుండగా కోపరేటివ్ స్టోర్స్‌కు ఎన్నికలెలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

అల్లవరం: మండలంలోని ఓడలరేవులో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో ఏడుగురు పిచ్చికుక్క కాటుకి గురయ్యారు. మన్నా కాలనీలో ఒకరు, చేపల మార్కెట్ వద్ద ఐదుగురు, ఏటిమొగ వద్ద ఒకరిని పిచ్చి కుక్క కరిచింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాధితులకు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కొల్లు ముత్యాలు ప్రస్తుతం అల్లవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు.

ఐదు ఖండాల్లో ఫ్రెంచ్ భాష



ఫ్రెంచి భాషపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షుడు సతీష్ నల్లా

యానాం: ప్రపంచంలోని ఐదు ఖండాల్లో సుమారు 300 మిలియన్ ప్రజలు ఫ్రెంచి భాషను మాట్లాడుతున్నారని, అత్యధికంగా మాట్లాడే భాషల్లో 5వ స్థానంలో ఫ్రెంచి ఉందని పుదుచ్చేరి ఫ్రెంచ్ కాన్సుల్ జనరల్ జీన్‌ఫిలిప్పీ హట్టర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాజుల ఫంక్షన్ హాలులో ది అలయన్స్ ఫ్రాంకైజ్ ఆఫ్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో యానాం రీజియన్ వారికి ఉచిత ఫ్రెంచి భాష ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రాన్స్ అధికార భాష ఫ్రెంచ్ భాష అని సరిహద్దు దేశాలైన బెల్జియం, జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, అండోరా, స్పెయిన్‌లో సైతం ఫ్రెంచి మాట్లాడతారన్నారు. ఆయా దేశాల్లో ఉపాధి కోసం వచ్చే యువతకు ఈ ఆన్‌లైన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా గతంలో ఫ్రెంచిపాలిత ప్రాంతాల్లో ఫ్రెంచి భాషను మరింత వ్యాప్తి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం, డైరెక్టర్ లేరెంట్ జాలికోస్, ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం



మామిడికుదురులో రాస్తారోకో చేస్తున్న మండల జేఏసీ ప్రతినిధులు



మలికిపురం కూడలిలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



కొత్తపేటలోని పలివెల వంతెన వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

కొత్తపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు తలపెట్టిన భారత్ బంద్ కొత్తపేట నియోజకవర్గంలో విజయవంతమైంది. జాతీయ స్థాయి నాయకుల పిలుపునకు కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాకటించాయి. కొత్తపేటలో రాష్ట్ర దళిత నాయకుడు, అముడ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జిల్లా మాలమహానాడు నాయకుడు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు తదితర నాయకుల పిలుపు మేరకు నాయకులు, యువకులు బైక్ ర్యాలీ చేశారు. స్థానిక బోడిపాలెం వంతెన సెంటర్‌లో రాస్తారోకో చేశారు.

రాజోలు నియోజకవర్గంలో..

రాజోలు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. రాజోలు నియోజవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. రాజోలు ఆర్టీసీ బస్టాండ్‌లో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు తదితర ముఖ్య నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, మాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మలికిపురంలో మాలల సంఘాలు బుధవారం పాటించిన భారత్ బంద్‌కు వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు రాపాక వర ప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావులు పాల్గొని బంద్‌కు సంఘీభావం తెలిపారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు. సఖినేటిపలి మాలల న్యాయపోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన బంద్‌కు రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు సంఘీభావం తెలిపారు.

పి.గన్నవరం నియోజకవర్గంలో..

పి.గన్నవరం: మండలంలో బంద్ ప్రశాతంగా జరిగింది. నియోజకవర్గంలోని పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. పి.గన్నవరంలో రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, కొండేటి చిట్టిబాబు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాయకులు పాల్గొన్నారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రావులపాలెంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు నిలుపుదల చేశారు. ముక్తేశ్వరం హైస్కూల్ సెంటర్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ప్రదర్శన చేశారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో నేడు మెగా మేళా

మండపేట: తపాలా జీవిత బీమా, సేవింగ్స్, బ్యాంక్ ఖాతాలు, ప్రమాద బీమా తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం గురువారం పట్టణంలో మెగా మేళా నిర్వహిస్తున్నట్టు పోస్ట్‌మాస్టర్ ఎండీ సుబ్బారెడ్డి బుధవారం చెప్పారు. మెగా మేళాను స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న నాళం చిన భీమయ్య సత్రంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి ఏపీ సర్కిల్, పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ. శివనాగరాజు (విజయవాడ) హాజరవుతారని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కాజులూరు: వ్యవసాయంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ కె మాధవి అన్నారు. బుధవారం శీలలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ కె.మాధవి, కరప ఏడీఏ కె.బాబూరావు తదితరులు పాల్గొని ఎరువుల యాజమాణ్యంపై రైతులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అవసరాన్ని మించి ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువులు వేప కాషాయం వంటివి వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. పురుగు మందులు అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చని తెలిపారు. అనంతరం మానవాళిపై పురుగు మందుల విష ప్రభావాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.